# రహస్యం

"జ్యోస్యులుగారు ఎన్నికల్లో నిలబడుతున్నారు. ధర్మరాజు మీద పోటీగా నామినేషన్ వేశారు!"

ఈ వార్తలు రావడమేమిటి- ఆ నగరంలో ఒక్కసారిగా అగ్నిపర్వతం పేలడం- తుఫాను- భూకంపం రావడం జరిగాయి. ఒక గడియ కాలం - ఆ వూరు మూగబోయింది.

మరుక్షణం ఆకాశమంత గందరగోళం చెలరేగింది.

"వినాశకాలే విపరీత బుద్ధి..." అని కొందరు అంటే-

"పెద్దతనంలో మతి పోయింది" అని మరికొందరు అన్నారు.

"పొట్టేలు కొండను ఢీకొట్టుకుంటోంది- పాపం!!" అని జాలి పడ్డారు.

అన్ని ప్రాంతాలలో లాగానే యీ నగరంలో కూడా ఎన్నికలు అయిదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే తిరునాళ్ళు.

నెల రోజులు మంచి సరదా, హడావిడి, సందడి - తరువాత అంతా మామూలే!

ఎందుకంటె - ఎన్నికలు, పదవులు యీ నగరంలో వంశపారంపర్యంగా వచ్చే వ్యవహారాలు. ఆ కుటుంబాలు ఆ నాలుగు రోజులు హైరానా పడటం, తరువాత అంతా గప్ చుప్!

ఈ నగరం- పల్లె నుంచి పంచాయితీ, పంచాయితీ నుంచి మున్సిపాలిటీగా మారినా - ఎన్నికలు జరిగినప్పుడు ధర్మరాజులుగారి కుటుంబం పాల్గొనడం, ఎన్నికై యీ నగరాన్ని పాలించటం అనాదిగా జరుగుతున్న తతంగం!!

పదవులు నిర్వహించకపోయినా - పలుకుబడి, ప్రతిష్ఠగల కుటుంబం- జ్యోస్యులగారిది.

జ్యోస్యులగారి తాతగారు - లక్ష్మీనారాయణ. జ్యోస్యులుగారు మంచి పండితుడు, ఆయుర్వేద వైద్యులు.

తండ్రిగారు రామకృష్ణ జ్యోస్యులుగారు మంచి కవి, గాయకుడు.

జ్యోస్యులుగారు బహుభాషా ప్రవీణుడు- జ్యోతిషం, వాస్తు, ముహూర్తం- వీటిలో చాలా దిట్ట.

ఆయన ముహూర్తం పెట్టారంటే ఎటువంటి శుభకార్యాలైనా నిర్విఘ్నంగా జరిగి తీరవలసిందే.

వారు వాస్తు నిర్ణయం చేసిన గృహంలో ఎప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలే!

ఆయన పరాయి యింట్లో విస్తరి వేసింది లేదు. గుమ్మం దాటి బయటకు వెళ్ళింది లేదు.

ఉదయం అనుష్ఠానం, పూజ ముగించుకుని వచ్చేసరికి వీరి దర్శనం కోసం ఎదురు చూసే ప్రజల సమస్యలు వినడం, పరిష్కారం సూచించడం.

ఇంత కావాలని అడిగే అలవాటుగాని, ఆనవాయితీగాని లేదు. ఇచ్చినది వద్దనడం లేదు.

మహారాజులాగా బ్రతకడమేగాని - రాజకీయాల జోలికి ఏనాడూ పోలేదు.

అందుకే అందరికి ఇంత ఆశ్చర్యం.

రాజకీయ జీవితంలో - కాకలు తీరిన యోధుడు ధర్మరాజులు. ఈ సుదీర్ఘ కాలంలో ఎందరో ప్రత్యర్థులు ఆయనను ఎదుర్కొన్నారు. శక్తి కొలది పోరాడారు. అంతిమ విజయం ఎప్పుడూ ధర్మరాజునే వరించేది. ఈనాటి వరకూ వరిస్తూ వచ్చింది.

జ్యోస్యులుగారు ఎన్నికలలో నిలబడుతున్నారంటే - అందులోనూ తన మీద పోటీ చేస్తున్నారంటే - అందరి కన్నా ఎక్కువ ఆశ్చర్యపడ్డది ధర్మరాజే!!

'ఈ వయస్సులో మీకు యీ ఎలక్షన్ల బెడద ఎందుకు - విరమించండి' అని జ్యోస్యులుగారి ఎదుట పడి చెప్పే ధైర్యంగాని, చొరవగాని లేదు.

అప్పటికే ఇద్దరు ముగ్గురు మధ్యవర్తుల ద్వారా తన మనస్సులోని మాట ఆయన చెవిని వేయించాడు.

ఆయన ఎప్పటిలాగానే చిరునవ్వు నవ్వి వూరుకున్నారు.

కాని ఆయన శిష్యులు ఊరుకోలేదు. "ఇంత కాలానికి గురువుగారికి ఒక చిన్న కోరిక కలిగింది. నోరు తెరిచి మనల్ని ఆయన ఏనాడూ అడగలేదు. వారి ఋణం తీర్చుకునే అవకాశం ఇదొక్కటే" అంటూ రంగప్రవేశం చేశారు.

ఇంటింటికి ప్రచారానికి రమ్మని గురువుగారిని రమ్మనడానికి ఎవరికి ధైర్యం?

చేతులు కట్టుకుని ఆయన గుమ్మంలో నిలబడ్డారు. ధైర్యం చేసి తమ విన్నపం మనవి చేసుకున్నారు.

ఆయన ఎప్పటిలాగానే చిరునవ్వు నవ్వి - మౌనంగా వూరుకున్నారు.

'మౌనం అంగీకార సూచకం'

ధర్మరాజులు మౌనంగా వూరుకోలేదు. వార్డు అంతా వాల్ పోస్టర్స్ వేయించాడు.

మంచిరోజు చూసి ప్రచారం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు.

ప్రతిసారి ప్రచారానికి ముహూర్తం జ్యోస్యులుగారే పెట్టేవారు. కాని యీనాడు ధర్మరాజులు వేరే సిద్ధాంతిని ఆశ్రయించక తప్పలేదు.

ముహూర్తానికి నాలుగు రోజులు వ్యవధి ఉండగానే పిడుగు లాంటి వార్త వచ్చింది.

ఓటర్లకు - స్త్రీలకు రెవికల గుడ్డలు, పసుపు కుంకుమ జ్యోస్యులగారు యిస్తున్నారు. ఓటర్లు స్వయంగా వారి ఇంటికి వెళ్ళి తెచ్చుకుంటున్నారు.

ధర్మరాజులకి చాలా జాలి వేసింది.

'గురువుగారు ఏ స్థాయికి దిగజారిపోయారు' అని బాధ పడ్డారు. కాని ఇది రాజకీయం. జీవన్మరణ సమస్య. బాధపడుతూ కూర్చుంటే సమస్య పరిష్కారం కాదు!

మన తక్షణ కర్తవ్యం?

మరునాటి నుంచి వార్డులో ఉన్న ప్రతి ఇంట్లో స్త్రీలకు, పురుషులకు ఓటు వున్నా సరే లేకపోయినా సరే - ఆడవాళ్ళకి చీరె జాకెట్టు, మొగవాళ్ళకి అత్తకోడళ్ల అంచు పంచ, ఉత్తరీయం ధర్మరాజులగారి మనుష్యులు స్వయంగా అందజేశారు.

ఆ రోజు సాయంకాలం జరిగిన బహిరంగ సభలో 'ధర్మరాజుగారికే మీ ఓటు' అని ఎలుగెత్తి చాటారు.

రెండు రోజులు గడిచాయో లేదో - ఇంకొక దుర్వార్త వచ్చింది.

జ్యోస్యులుగారు - ఓటర్లుకు కంచు గ్లాసులు - కుంకుమ భరిణెలు పంచిపెడుతున్నారు.

ధర్మరాజుకి ఇంకా చాలా బాధ కలిగింది. ఇలా ఇచ్చుకుంటూ పోతే గురువుగారి దగ్గర ఏమి మిగులుతుంది?

కాని ఇది సానుభూతికి సమయం కాదు.

పగవాడి చేతిలో ఆయుధం వున్నంతవరకూ మనం కూడా ఆ యుద్ధంలో పోట్లాడవచ్చు. దాంట్లో ఏం తప్పు లేదు. అదే ధర్మయుద్ధం.

శత్రువు మీద జాలిపడి యుద్ధాలు గెలవలేము.

మరునాడు సూర్యాస్తమయం లోపల ప్రతి ఓటరుకు లింగ భేదంతో నిమిత్తం లేకుండా - ఒక మంచి ఇత్తడి బిందే, రెండు పెద్ద సైజు కంచు గ్లాసులు- ధర్మరాజు స్వయంగా తన వార్డులోని వారికి అందజేశాడు.

ఆ రోజు సాయంకాలం సభలో జ్యోస్యులుగారి రాజకీయ అజ్ఞానం - అనుభవ శూన్యత గురించి కొందరు మహనీయులు ఉపన్యసించారు.

ఇంత జరిగినా జ్యోస్యులుగారి దినచర్యలో కాని, దైనందిన కార్యక్రమాలలో కాని ఎటువంటి మార్పు లేదు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఎన్నికలు గురించి ఆయన ఎవరితోనూ చర్చించక పోవడం.

చివరికి వార్డులో ఏర్పాటు చేసిన ఒకే ఒక సభలో ఆయన - మూల విరాట్టులాగా పెదవి కదల్చకుండా కూర్చోడం అందరికి ఆశ్చర్యం కలిగించింది.

"ధర్మరాజుగారి లాంటి అనుభవజ్ఞుని కాదని, ఏవీ చేతకాని తనకు ఓటు వేయమని అడగటానికి నోరు రాకనే ఆయన మౌనంగా వున్నాడు" అని ప్రత్యర్థులు వ్యాఖ్యానం చేశారు.

ఇహ రెండు రోజులలో ఎన్నికలు పోలింగ్. ప్రదోష కాలంలో వచ్చిన వార్త సిద్ధాంతిగారు ఓటర్లకి డబ్బు యిస్తున్నారని.

"ఎంత?" అని ధర్మరాజు అడిగాడు.

"పాతికో ముప్పైయో యిస్తున్నారట" అని సమాధానం వచ్చింది.

ధర్మరాజుకి యీ వార్త సమ్మెట దెబ్బలాగా తగిలింది.

"గురువుగారికి డబ్బుపెట్టి ఓట్లు కొనుక్కునే పరిస్థితి వచ్చిందంటే నిజంగా ఆయనకు ఇవి చాలా చెడ్డరోజులు. పిల్లలుగాని, ఆ యిల్లాలు కాని ఇది కూడదని చెప్పవచ్చుగా?" అంటూ చాలా దిగులు పడ్డాడు.

దిగులు పడితే పనులు జరగవు కదా? అర్ధరాత్రి కాకుండానే పుచ్చుకునే వాళ్లందరికి యాభైకి తగ్గకుండా, వందకు మించకుండా ముడుపులు ముట్టాయి.

ఎన్నికల రోజు వచ్చింది. జట్కాబండ్లు, టాపు లేని కార్లలో ఓటర్ల - ధర్మరాజు గారి సౌజన్యంతో పోలింగ్ బూత్‌కు వచ్చి - తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు.

సాయంకాలం అయిదు గంటల దాకా సమయం ఉన్నా మధ్యాహ్నం - మూడు గంటలకే యీ కార్యక్రమం పూర్తి అయింది. నగరంలో లేని వాళ్ళు,

అనారోగ్యం వల్ల మంచం పట్టినవాళ్లు -అంతా కలిసి పదిమందిలోపే. మిగతా అందరూ వోటు వేసి వెళ్లారు.

ఓట్ల లెక్కింపు కాకపోయినా - మెజారిటీ సంగతి తెలియక పోయినా ధర్మరాజు అనుచరులు వేసిన అంచనాల ప్రకారం అత్యధిక మెజారిటీతో తమ నాయకుడు గెలుస్తాడని, ప్రత్యర్థికి డిపాజిట్లు కూడా దక్కదని, ఇది ప్రతిసారీ జరిగేదే, యీ సారి అంతేనని నిర్ధారణ చేసుకున్నారు. యధాశక్తిగా పండగ చేసుకున్నారు.

మరునాడు ఉదయం పది గంటలకు ఓట్లు లెక్కపెట్టడం మొదలు పెట్టారు. ఉన్నది ఇద్దరు అభ్యర్థులు. వెయ్యికి లోపుగా పోలయిన ఓట్లు.

మధ్యాహ్నం 3 గంటల సమయం - జ్యోస్యులుగారు భోజనానంతరం విశ్రాంతి తీసుకుని నిద్దర లేచే సమయం.

ఎదురు చూస్తున్న శుభవార్త వచ్చింది. వూరు వూరంతా క్షణకాలం మూగబోయింది.

తొంభై ఓట్లు ధర్మరాజుకి, తొమ్మిది వందలు ఓట్లు జ్యోస్యులుగారికి వచ్చాయి. ధర్మరాజు డిపాజిట్టు పోగొట్టుకున్నాడని.

ఇహ రాక తప్పదు కాబట్టి జ్యోస్యులుగారు మునిసిపల్ ఆఫీసుకు వచ్చారు.

అటువంటి మహావ్యక్తి తమ ఆఫీసుకు రావటం - అందులో కౌన్సిలరుగా రావటం అక్కడివారందరికీ చాలా సంబరంగా వుంది.

జ్యోస్యులుగారికి అందరికన్నా ముందుగా పెద్ద పూలమాల వేసింది ధర్మరాజు. ఆయనకు పాదాభివందనం చేసి-

"నాకు చాలా ఆనందంగా వుంది. మీలాంటివారికి అపజయం కలిగితే- ఈ ప్రాంతంలో ధర్మం లేనట్టే" అన్నాడు.

ధర్మరాజు అతని అనుచరులు, "జోస్యులుగారు జిందాబాద్" అంటూ జయ జయ నాదాలు చేసుకుంటూ వెంటరాగా - ఊరేగింపు సిద్ధాంతిగారి ఇంటికి సాగింది.

ఇంతకంటే ఆశ్చర్యం జ్యోస్యులుగారు ఏకగ్రీవంగా మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికవడం.

ఏకగ్రీవంగా యీ కార్యక్రమం జరగడానికి ధర్మరాజు ప్రధాన పాత్ర వహించటం - అందరికి ఆనందం కలిగించింది. ఊరు ఊరంతా మూక ఉమ్మడిగా- మళ్ళీ యింకోసారి - మార్గశిర మాసంలో దీపావళి చేసుకుంది.

ఎన్నికల వేడి చల్లారింది. మామూలు వాతావరణం యథాప్రకారం వచ్చింది.

ఎప్పటిలాగానే పండూ ఫలం చేతపట్టుకుని ధర్మరాజు జ్యోస్యులుగారి దర్శనానికి వచ్చాడు.

చక్కటి స్వాగతం లభించింది. కుశల ప్రశ్నలు అయ్యాయి. ఏదో అడగటానికి ప్రయత్నం చేసి - ధర్మరాజు రెండుసార్లు ఆగిపోయాడు.

గురువుగారు పెద్దపెట్టున నవ్వారు. "సందేహం దేనికి నిర్భయంగా అడుగు- చల్లకొచ్చి ముంత దాచడం దేనికి?" అన్నారు.

ధర్మరాజు ఏం మాట్లాడలేదు.

"ఈ ఛాందసుడు నీ మీద ఎల్లా గెలిచాడా? అనేదే కదా నీ ధర్మ సందేహం?"

అవునన్నట్టుగా ధర్మరాజు తల వూపాడు.

"నేను గెలవడానికి నువ్వే కారణం!! నేను ఎన్నికలలో నిలబడటానికి ప్రేరణ కూడా నీదే" జ్యోస్యులుగారు అన్నారు.

"నాకంతా అయోమయంగా ఉంది."

"దీంట్లో అయోమయం ఏమీలేదు - రెండు నెలల క్రితం - శంఖుస్థాపన ముహూర్తం కావాలని నువ్వు మా యింటికి వచ్చినప్పుడు నీ జాతకం పరీక్షగా చూశాను. నాలుగు విషయాలు కొట్టవచ్చినట్టు కనిపించాయి. ధన వ్యయం- యత్నకార్య వైఫల్యం, సమాజంలో అగౌరవం! శరీర శ్రమ! ప్రస్తుత గోచారం వల్ల గాని, దశ అంతర్దశలలో గాని నీకు ఇవి సంభవించటానికి అవకాశం ఉంది.

ఎన్నికల నామినేషన్లు, వాటి వివరాలు చూశాను. నువ్వు నామినేషన్ జన్మతారలో వేశావు. దానికి శని అధిపతి. ప్రచారం విపత్ తారలో మొదలు పెట్టావు. అంతా ఆదుర్దా, హైరానా. ఎన్నికల రోజు నీకు ప్రత్యక తార. అన్నీ కష్టాలే. ఓట్లు లెక్కపెట్టి ఎన్నికల ఫలితాలు వచ్చే సమయానికి నీకు వైధవ తార- వైధవం అంటే మరణం. అందుకనే ఎన్నికలలో ఘోర పరాజయం.

"అంటే యిప్పుడున్న పరిస్థితులలో నీకు పోటీగా ఎవ్వరు నిలబడ్డా గెలుస్తారు.

"మరి నా సంగతి అంటావా? ఇప్పుడు జాతకరీత్యా విపరీత మహారాజ యోగం.

"యత్న కార్యసిద్ధి. సమాజంలో గౌరవం. ముద్రాధికారం, సమాజ సేవ, రాజ ఆశ్రయం, గ్రామాధిపత్యం.

"గోచార రీత్యా మహా దశ వల్ల నాకు లభించే ఫలితాలు.

"మనం ఇద్దరం మంచి స్నేహితులం. నువ్వు ఎవరో అనామకుడి చేతిలో పరాజయం పొందకూడదని యీ సాహసం చేశాను. కాలం కలసి వచ్చింది.

"ఒక్క విషయం గుర్తుంచుకో. యుద్ధంలో మన విజయం మన బల పరాక్రమాలు మీదనే కాకుండా శత్రువు బలహీనత మీద ఎక్కువ ఆధారపడి వుంటుంది. అదే మన విజయ రహస్యం!"